కులగణనకు మూడు రోజులే గడువు
● ఎన్యుమరేటర్లు బాధ్యతగా పూర్తి చేయాలి ● బళ్లారి నగరంలో వేగం పెంచాలి
: కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్
6

'బీమా' హత్యలపై పోలీసుల ఆరా
● కలకలం రేపిన దివ్యాంగుడు గంగాధర హత్య





నాన్చొద్దు.. తేల్చండి..!

● నాయకత్వ మార్పు లేదంటే బహిరంగంగా ప్రకటించండి
● పార్టీ కోసం ఎంతో కష్టపడ్డా..
● నా కష్టానికి తగిన ప్రతిఫలం కావాలి కదా
● సుర్జేవాలా వద్ద డీసీఎం డీకే శివకుమార్ ఆవేదన

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు నవంబరు ముహూర్తమని కొన్ని నెలలుగా సాగుతున్న ప్రక్రియ. తాజాగా పార్టీ నాయకులు మంత్రులు ఇటు వంటి వ్యాఖ్యలు చేస్తుండడం వివాదాలకు కారణమవుతున్న సంగతి తెలిసిందే. బెంగళూరు పర్యటనలో ఉన్న పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాను డీసీఎం డీకే శివకుమార్ భేటీ అయ్యారు. ఇద్దరి మధ్య తీవ్రమైన చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. పార్టీకి చెందిన ఎమ్మెల్యే రంగనాథ్, మాజీ ఎంపీ శివరామేగౌడలు ఇటీవల డీసీఎం డీకే శివకుమార్ సీఎం అవుతారంటూ చేసిన వ్యాఖ్యలకు మందలించా నన్నారు. కానీ సీఎం సిద్దరామయ్య తరచూ తానే ఐదేళ్ల ముఖ్య మంత్రి అంటూ వ్యాఖ్యానిస్తున్నారని, ఏమని అర్థం చేసుకోవాలని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. పవర్ షేరింగ్ లేదంటే బహిరంగం చేయండి... అంతేగానీ ఇలా నాన్చుడు వ్యవహారం సరికాదని, పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నేను ఎంతో కష్టపడ్డానని సుర్జేవాలా ముందు వెల్లడించినట్లు తెలుస్తోంది. రాత్రింబవళ్లు ఆలోచించలేదని, ఖర్చులకు వెనుకాడలేదని, తన శ్రమకు ప్రతిఫలం ఉండాలిగదా..?, అధిష్ఠానం దీనిపై తనకు స్పష్టత ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. శుక్రవారం సంపంగిరామనగర్‌లో మీరు (సుర్జేవాలా) మీడియాతో ముఖ్యమంత్రి మార్పుకు సంబంధించి అధిష్ఠానం వద్ద ఎలాంటి చర్చలు లేవని, ఆదేశాలకు మీరి కొందరు మాట్లాడారంటూ మీడియాకు వివరించారన్నారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. కానీ బహిరంగ వేదికలపైనే సీఎం వ్యాఖ్యలను ఏమని అర్థం చేసుకోవాలని ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

డీకేశీ సీఎం కావాలి: మంత్రి జమీర్



డీసీఎం డీకే శివకుమార్ పార్టీ కోసం ఎంతో శ్రమించారని, అతను ముఖ్యమంత్రి కావడంలో తప్పులేదని వసతి శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ అభిప్రాయపడ్డారు. అయితే పార్టీలో అధిష్ఠానందే తుది నిర్ణయం అన్నారు. బీజేపీ వారు ఏదీ చెప్పినట్టు జరగదన్నారు. ప్రస్తుతం ఐదేళ్ల సిద్దరామయ్య సీఎంగా ఉంటారని, ప్రస్తుతానికి ఏమార్పు లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కనీసం 15ఏళ్లు కావాలని, 2018లోనూ మాదే ప్రభుత్వం ఉంటుందన్నారు.

సిద్దరామయ్య సీఎంగా కొనసాగుతారు
: మంత్రి మహదేవప్ప



రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని, సిద్దరామయ్య సీఎంగా కొనసాగుతారని మంత్రి మహదేవప్ప అభిప్రాయపడ్డారు. శనివారం మైసూరులో మీడియాతో మాట్లాడిన ఆయన కాలానుగుణంగా అధిష్ఠానం నిర్ణయాలు తీసుకుంటుందని, అందరూ కట్టుబడి ఉండాల్సిందే అన్నారు. అధిష్ఠానం మినహా మిగిలినవారు ఏం మాట్లాడినా వృథా అన్నారు.

మా అంతరంగిక విషయాలు బీజేపీకి ఎందుకు ..?
: సీఎం సిద్దరామయ్య



మా పార్టీ అంతరంగిక విషయాలు బీజేపీ నాయకులకు ఎందుకని సీఎం సిద్దరామయ్య ప్రశ్నించారు. బెళగావి ఎయిర్‌పోర్ట్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ పదే పదే తానేముఖ్యమంత్రి అంటూ సిద్దరామయ్య హైకమాండ్‌ను బెదిరిస్తున్నారని బీజేపీ నేత సీటీ రవి వ్యాఖ్యలపై స్పందించారు. వారు ఏమైనా మా పార్టీ అధిష్ఠానమా... అంటూ నిలదీశారు. గ్యారెంటీ పథకాలకు కేంద్రప్రభుత్వ ఎన్‌డీఆర్‌ఎఫ్ గ్రాంట్లు వాడుకోలేదన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల

● అదే నా ఆశయం : బెళగావి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు ఉత్తమ ఆరోగ్యసేవలు అందించేలా ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కళాశాలతోపాటు మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించడం తన ఆశయమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. బెళగావి మెడికల్ కళాశాలకు అనుబంధంగా నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ల క్వార్టర్స్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. బెళగావి స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభించారు. రాణిచన్నమ్మ యూనివర్సిటీకి అనుబంధంగా హిరేబాగేవాడిలో పలు భవనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేవలం సకల సౌకర్యాలతో భవనాలు యంత్రాలు సమకూరిస్తే ప్రయోజనం లేదని అందుకు తగినట్లుగా వైద్యనిపుణులు కూడా ఉండాలని ఖాళీపోస్టులను అంచలంచెలుగా భర్తీ చేస్తామన్నారు. ప్రభాకర్ కోరె మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితసేవలు అందిస్తున్నందున ప్రభాకర్ కోరెకు ప్రత్యేకంగా అభినందనలన్నారు. తమ ప్రభుత్వం అసమానత రూపుమాపాలనేది లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తొలిసారి సీఎంగా పలు భాగ్యలను తీసుకొచ్చానని, ప్రస్తుతం గ్యారెంటీలతో ప్రతి మనిషి తలసరి ఆదాయం పెంచానన్నారు. రాష్ట్రంలో 8 జిల్లాల్లో 95శాతం ఎక్కువ వర్షాలు కురిశాయని, 10లక్షల హెక్టార్లలో పంటనాశనం అయ్యిందన్నారు. రైతులను ఆదుకునే విషయంలో రాజీ లేదన్నారు. మంత్రులు సతీశ్‌జార్కిహొళి, శరణ ప్రకాశ్‌పాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్, రామలింగారెడ్డి, ఎంసీ సుధాకర్ పాల్గొన్నారు.



ఎంఆర్‌ఐ యంత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం



ధన్యబాయి (ఫైల్)

ఇద్దరు బాలికల అనుమానాస్పద మృతి

● బహిర్భూమికి వెళ్లి విగతజీవులుగా మారారు ● కోలారు జిల్లా ముళబాగిలులో దారుణం

ముళబాగిలు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా యలచేపల్లి గ్రామంలో ఇద్దరు బాలికలు అనుమానా స్పదంగా మృతి చెందారు. గ్రామానికి చెందిన ధన్యబాయి (13), చైత్రబాయి (13) ఈనెల 2న బహిర్భూమికి వెళ్లి కనిపించకుండా పోయారు. వీరిద్దరూ యలచేపల్లి హైస్కూల్‌లో చదువుతున్నారు. ఇద్దరూ ఒకేసారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. అనంతరం ముళబాగిలు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం కుప్పంపాళ్య గ్రామ సమీపంలోని బావిలో ఇద్దరి మృతదేహాలు వెలుగులోకి రావడం ఆందోళన రేకెత్తించింది. బాలికల మృతి పలు అనుమానాలకు దారి తీస్తోంది. కోలారు ఎస్పీ నిఖిల్‌తోపాటు పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇంటికి సమీపంలో బహిర్భూమికి వెళ్లినవారు పది కిలోమీటర్ల దూరం ఎలా వెళ్లారు, వీరిని తీసుకెళ్లినవారు ఎవరు..? ఎలా మృతి చెందారనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. బాలికల మృతితో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి.



చైత్రబాయి (ఫైల్)

రేపు చింతామణికి పవన్‌కల్యాణ్

● రిటైర్డ్ న్యాయమూర్తి జన్మదిన వేడుకల్లో పాల్గొననున్న ఏపీ డీసీఎం
● బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ కుశాల్ చౌక్సి సమీక్ష



సమీక్షా సమావేశంలో ఎస్పీ కుశాల్‌చౌక్సి తదితరులు

చింతామణి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ వీ గోపాల్‌గౌడ 75వ పుట్టినరోజు సందర్భంగా ఏపీ డిప్యూటి సీఎం, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ సోమవారం చింతామణికి రానున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ శివారులోని బెంగళూరు రోడ్డు చిన్నసంద్ర వద్ద వేదిక ఏర్పాటు, బందోబస్తుపై చిక్కబళ్లాపుర జిల్లా ఎస్పీ కుశాల్ చౌక్సి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏఎస్పీ జగన్నాథ్ రై, డీఎస్పీ మురళీధర్, తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, టౌన్ సీఐ విజికుమార్, రూరల్ సీఐ శివరాజ్, ప్రజాపనులశాఖ ఏఈఈ నాగరాజ్, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ రామచంద్రరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి పాలనాధికారి సంతోష్‌కుమార్, ఆర్టీఓ పూజా, అగ్నిమాపకశాఖ అధికారి లోకేశ్, బెస్కాం ఏఈఈ శివశంకర్ పాల్గొన్నారు.



జలమయమైన హోసూరు పరిసర ప్రాంతం

వణికించిన వరుణుడు

● హోసూరులో 12 సెం.మీ. వర్షపాతం నమోదు
● జలమయమైన ప్రధాన రహదారులు

లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

హోసూరు (కృష్ణగిరి) (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో ఇటీవల వరుస వర్షాలు కురుస్తుండడంతో వర్షపునీటి ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ దినేశ్‌కుమార్ శనివారం స్వయంగా పరిశీలించారు. కృష్ణగిరి మునిసిపాలిటీలోని ఆవిన్ ఫ్లై ఓవర్ సమీపాన టీసీఆర్ జంక్షన్ బస్టాండ్ వద్ద నిలిచిన వర్షపునీటిని తోడేసే పనులను పర్యవేక్షించారు. అలాగే చెన్నై డివిజన్‌రోడ్డు ప్రాంతంలో జాతీయ రహదారి వెంబడి మురుగుకాలువల పునరుద్ధరణ పనులకు సంబంధించి కాలువలపై అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. తహసీల్దార్ రమేశ్, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉమాశంకర్, మునిసిపాలిటీ అర్బన్ వెల్ఫేర్ ఆఫీసర్ గణేశ్ పాల్గొన్నారు.

హోసూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం సహా చుట్టుపక్కల ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. పార్వతినగర్ ప్రాంతంలో ఒక గోడ కూలిపోయింది. బీబీఏ మూడో సంవత్సరం చదువుతున్న 19 ఏళ్ల సుతప్పకు కాలు విరిగింది. వెంటనే అతడిని స్థానికులు రక్షించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలలో భారీ వర్షం కురవడంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతోంది. హోసూరులో 120 మిమీ వర్షం, కెలమంగళంలో 30 మిమీ, అంచెట్టిలో 20 మిమీ, డెంకణకోట్టైలో 26 మిమీ, రాయకోట్టైలో 28 మిమీ, సూలగిరిలో 40 మిమీ, కెలవరపల్లి ఆనకట్ట ప్రాంతంలో 30 మిమీ వర్షపాతం నమోదైంది.

జలాశయాలకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

కృష్ణగిరి జిల్లా, తాలూకాలలో వర్షాల కారణంగా డ్యాంలలో నీటి ప్రమాణం పెరుగుతోంది. కృష్ణగిరి డ్యాం సామర్థ్యం 52 అడుగులు (1666.29 క్యూసెక్కులు) శనివారం నాటికి 50.25 అడుగులుగా (1468.35 క్యూసెక్కులు) ఉంది. డ్యాంకు ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో నీటిని విడుదల చేయదలిచామని, కాలువకు అనుబంధంగా ఉండే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. తెన్‌పెన్నై నది, సాతనూరు డ్యాంలకు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. పెరియ ముత్తూరు, తిమ్మాపురం, సుండేకుప్పం, కావేరిపట్టణం, పెన్నేశ్వరం, చొట్టహళ్ళి, తాలిహళ్ళి, గల్వేహళ్ళి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.



బస్టాండ్‌లో ఆగిన వర్షపునీటిని తోడేస్తున్నతీరును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్




చీకటి బతుకులు..!

● అంధకారంలో అటవీ సమీప గ్రామాలు
● కిరోసిన్ దీపాలే దిక్కు
● సీఎం ఆదేశించినా వెలుగులు నింపని విద్యుత్‌శాఖ
● స్తంభాల ఏర్పాటుకు అనుమతులివ్వని అటవీ శాఖ

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచం అంతా విద్యుత్ కాంతులు ప్రకాశిస్తున్నా ఆ గ్రామాలు కటిక చీకట్లోనే మగ్గుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది పదులు సమీపిస్తోంది. అయినా సామాన్యుడికి మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. సాధారణంగా ఓ వ్యక్తి లేదా కుటుంబం ఎక్కడ జీవనం సాగిస్తున్నా ప్రభుత్వంలోని వివిధశాఖలు వారికి కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్ వంటి సౌలభ్యాలు కల్పించాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రంలోని మూడు జిల్లాల పరిధిలోని పలు తాలూకాలకు అనుబంధంగా అటవీప్రాంతాల చెంతన నివసిస్తున్న వారికి నేటికీ విద్యుత్ సదుపాయం కల్పించలేదు. కుదురేముఖ్ జాతీయ ఉద్యానవనం పరిధిలోని మలెనాడు, తీరప్రాంతాలకు అనుబంధంగా ఉండే తెగలకు చెందినవారు కిరోసిన్ దీపాలతోనే జీవనం సాగిస్తున్నారు.



అటవీ శివారు ప్రాంతాల్లో వనజీవుల గుడిసెలు

అమలు కాని ముఖ్యమంత్రి ఆదేశాలు

హాడి, మజరా (కుగ్రామం) వంటి ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి విద్యుత్ సదుపాయం కల్పించాలని సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. అయితే విద్యుత్ కంపెనీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కుగ్రామాలలో నివసించేవారికి వివిధశాఖల ద్వారా గ్రాంట్లు కేటాయించాలని సీఎం సూచించారు. సాంఘిక సంక్షేమ, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ విభాగాలకు ఏటా వేల కోట్ల రూపాయలు గ్రాంట్లు కేటాయిస్తున్నా అత్యవసరమైన కరెంటు సమకూర్చే విషయంలో ప్రగతికి నోచుకోలేదు. ఇప్పటికీ పలు జిల్లాల్లో కరెంటు సౌకర్యం కల్పించే ప్రక్రియ కొనసాగింది. ఉడుపి జిల్లా కార్కళ, హెబ్రి, చిక్కమగళూరు జిల్లా శృంగేరి తాలూకా పరిధిలోని కుదురేముఖ్ జాతీయ ఉద్యానవనంకు అనుబంధంగా ఉండే ఏడు కుగ్రామాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వనే లేదు. అడవులు నాశనం, పునరావాస పథకం కారణం చూపి వన్యజీవి మండలి విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు అభ్యంతరం తెల్పుతోంది.

నక్సల్స్ ప్రభావమూ అధికమే..

నక్సల్స్‌పీడిత ప్రాంతంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతాల్లో పోలీసు శాఖకు సమగ్ర సమాచారం ఉంది. ఈ ప్రాంత ప్రజల జీవనవిధానం స్వయంగా పోలీసులు, నక్సల్స్ నియంత్రణ దళాలకు సంవత్సరాల కాలంగా తెలిసిన విషయమే. ఇప్పటికీ ఈ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. అటవీ ప్రాంతానికి అనుబంధమైన కుగ్రామాలకు రోడ్డు, విద్యుత్ కల్పిస్తామని కొన్నేళ్లకాలంగా పాలకులు బహిరంగ ప్రకటనలు చేశారు. కానీ ఏదీ అమలుకు నోచుకోలేదు. గతంలో 2013 నుంచి 2018 వరకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా వ్యవహరించిన హెచ్ ఆంజనేయ ఏడాదికి ఒకటి రెండుసార్లు అటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే గిరిజనుల కాలనీలను సందర్శించేవారు. అక్కడే రోజంతా గడిపేవారు, వారిని జనజీవనస్రవంతిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. వారికి వర్షాకాలంలో నిత్యావసర వస్తువులను ఒకేసారి నాలుగైదు నెలలకు అవసరమైన మేర పంపిణీ చేసేవారు. వర్షాకాలంలో అటవీప్రాంతం నుంచి వారు ఏ విధమైన పదార్థాలను తీసుకొచ్చి విక్రయించుకోవడం లేదా ఆహారంగా మార్చుకునేందుకు వీలు లేదని గుర్తించి కల్పించేవారు. చిక్కమగళూరు జిల్లా శృంగేరి తాలూకా యమ్మగుండి, యాదగారు, హొరానా ప్రాంతాలు, ఉడుపి జిల్లా హెబ్రి తాలూకా తింగళమక్కి, మూరంటబైలు, కార్కళ తాలూకా కన్యాళ, భర్కళ, ఈదు ప్రాంతాలతోపాటు బెళ్తంగడి సరిహద్దు ప్రాంతాల్లోనూ విద్యుత్ సౌలభ్యం కల్పించే ప్రస్తావనలు దశాబ్దన్నర కాలంగా కొనసాగుతూనే ఉన్నాయి. విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు సంబంధితశాఖ సిద్ధమైనా అటవీశాఖ అభ్యంతరాలు తెల్పుతోంది. ఇప్పటికే మంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ (మెస్కాం), గౌడ్లు, మలెకుడియ ప్రాంతాలలోని ఆదివాసీ కుటుంబాలు అత్యధికంగా ఉండే ప్రాంతాలకు 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఇళ్లకు కరెంటు సదుపాయం తీసుకొచ్చారు. అయితే కుదురేముఖ్ జాతీయ ఉద్యానవనం పరిధిలో వన్యజీవి మండలి అనుమతి తప్పనిసరి కావడంతో పనులు ముందుకు సాగడం లేదు.



కుద్రేముఖ్ లేబర్ కాలనీ

అసలు సమస్య అటవీశాఖతోనే

ఇటీవలే అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె స్థాయి సమితి సమావేశంలో విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చేందుకు నిరాకరించారు. అయితే భూమి లోపల కేబుల్ ఏర్పాటు లేదా ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించేందుకు నివేదిక ఇవ్వాలని మెస్కాంకు ఆదేశాలు జారీ చేశారు. కుదురేముఖ్ పరిధిలో అటవీశాఖ పునరావాస పథకంకోసం కసరత్తు చేస్తోంది. పలు ఆదివాసీ కుటుంబాలకు ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణం జరిపితే అటవీప్రాంతాలలో విద్యుత్‌లైన్ల ఏర్పాటు ప్రస్తావన ఉండదు. హాడి (హట్టి) విద్యుదీకరణ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి 'జుగు' పథకం కింద 9 ఇళ్లను గుర్తిస్తే విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు. దక్షిణకన్నడ, ఉడుపి, చిక్కమగళూరుల జిల్లాఅధికారులు సమన్వయంగా వ్యవహరించి గ్రామస్తులకు విద్యుత్ కల్పించేందుకు చొరవ చూపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	14,037	14,948
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13,627	10,187
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

కులగణనకు మూడు రోజులే గడువు

● ఎన్యుమరేటర్లు బాధ్యతగా పూర్తి చేయాలి ● బళ్లారి నగరంతో పాటు సమీప గ్రామాల్లో వేగం పెంచాలి : కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక వెనుకబడిన తరగతుల సామాజిక, విద్యాసర్వేకు ఇంకా మూడు రోజలే గడువు మిగిలి ఉందని, నగర సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేశ్వన్ వీడియో ఆడిటోరియంలో జిల్లాలో ఇప్పటివరకు వెనుకబడిన తరగతుల సామాజిక విద్యా సర్వే పనులపై జరిగిన ప్రగతి సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి నగరం తాలూకా ప్రాంతాల్లో మరింత పురోగతి సాదించాలని , గణన చారులకు మార్గదర్శకత్వం అందించాలని ఆయన నోడల్ అధికారులను ఆదేశించారు. అదనపు సిబ్బందిని, ఇప్పటికే శిక్షణ పూర్తి చేసిన సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ భవనాలపై జెస్కాం శాఖ మీటర్ రీడర్లు స్టిక్కర్లను అతికించడం వల్ల ఎన్యూమలేటర్లు సర్వే పనుల్లో ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల అనుబంధ గృహాలను చూపించి వారితోపాటు రావాలని జెస్కాం అధికారులను మీటర్ రీడర్లు కోరారు. పెండింగ్ ఇళ్లగురించి నోడల్ అధికారుల నుంచి సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ అందుబాటులో ఉన్న సమయంలో వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్, జడ్పీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, డీఎంఎఫ్ స్పెషల్ ఆఫీసర్ లోకేశ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్ప, షెడ్యూల్డ్ తరగతుల సంక్షేమ అధికారి, జెస్కామ్ అధికారులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలిన ప్రమాదంలో మరో ఇద్దరు మృతి

● నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



కవిత, మైలారప్ప(ఫైల్)

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గత నెల సెప్టెంబరు 27వ తేదీన గాదిగనూరు గ్రామంలో జరిగిన సిలిండర్ ప్రమాదంలో గాయపడిన వారిలో మరో ఇద్దరు శుక్రవారం రాత్రి వ్రావిక్టోరియా ఆసుపత్రిలో మృతి చెందారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య నాలుగు చేరింది. వీరిలో కవిత(30), మైలారప్ప(45)లు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆసుపత్రిలో మృతి చెందిన న్యాయవాది హాలప్ప, తల్లి గంగమ్మలు శుక్రవారం మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం గాదిగనూరుకు తీసుకొచ్చి రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే ప్రమాదంలో విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హాలప్ప భార్య కవితా, మైలారప్పలు మృతి చెందిన వార్త బాధితుల కుటుంబంపై మరో పిడుగు పడినట్లు అయింది. వీరిద్దరి మృతదేహాలు శనివారం రాత్రికి చేరే అవకాశం ఉంది. సెప్టెంబరు 27వ తేదీన తెల్లవారు జమాజున సిలిండర్ పేలుడు ఘటనలో ఇంటిలో ఉన్న 11మంది గాయపడ్డారు. గాయపడిన వారిని మొదట తోరణగల్లు సంజీవిని ఆసుపత్రికలో చేర్పించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించి చికిత్స ఇస్తున్న నేపథ్యంలో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. మిగిలిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు హొసపేట రూరల్ పోలీసులు తెలిపారు. సిలిండర్ ప్రమాదంలో ఒకే సారి ఇంటిల్లిపాది ఘటనలో తీవ్రంగా గాయపడిన ఘటన... గాదిగనూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

తాడిపత్రి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ మూడవరోడ్డులో ఉన్న శ్రీవాణి స్మార్ట్ స్కూలులో శనివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తాడిపత్రి ఖండ మహారాణా ప్రతాప్ బస్తీ ప్రముఖ్ సీబీ మధుసూదన్‌రావు మాట్లాడుతూ హిందువులు అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. తల్లిదండ్రులు కుటుంబాన్ని ప్రేమించడం నేర్పిస్తే ఆర్ఎస్ఎస్ దేశాన్ని ప్రేమించడం నేర్పిస్తుందన్నారు. డాక్టర్ భానుసుజిత్‌రెడ్డి, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి పుట్టా శేషు తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ' ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న బీజేపీ జిల్లా కార్యదర్శి ఉజ్వల శ్రీధర్

బళ్లారి సిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని పటేల్ నగర్ వెంకటేశ్వర ఆలయంలో అమ్మట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లాకార్యదర్శి ఉజ్వల శ్రీధర్ శిబిరాన్ని ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మ ట్రస్ట్ వైద్యసేవలను కొనియాడారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సహకారంతో శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ సాత్విక్ ,డాక్టర్ చందన్ జ్యోతిలక్ష్మీ, సిద్దరాము, సద్దేశ్వరరావు, ఎర్రిస్వామి.డీగ్రూప్ ఉద్యోగులు అజయ్ కుమార్,అనేక మంది కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంలో బీజేపీ నాయకులు ప్రదీప్, ఉదయ్, అమ్మట్రస్టు అధ్యక్షుడు మాసూమ్ భాషా, సందీప్,అఖిల్, సాగర్ మహేశ్,ఉమర్, నీలకంఠ,కౌశిక్,పలువురు అమ్మట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.వందమందికి పైగా కంటి పరీక్షలు చుయించుకుని తగిన చికిత్స పొందారు. తీవ్రమైన సమస్యలు ఉన్నవారిని తదుపరి చికిత్స కోసం విమ్స్ జిల్లా ఆసుపత్రిలో చేర్చుకోవాలని సూచించారు.

ఘనంగా మద్వాచార్య జయంతి



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బళ్లారి సిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉడిపి శ్రీ కృష్ణుడిని సాక్షత్కారించి, విష్ణు సహస్రనామానికి అద్భుతమైన వాఖ్యానం రచించిన మద్వాచార్యుల జయంతిని నగరంలో శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మద్వాచార్యుల చిత్రపటంతో సత్యనారాయణ పేట ప్రధాన రోడ్డులోని వెంకటేశ్వర ఆలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా పండితులు జితేంద్ర ఆచార్, నవీన్‌ఆచార్, సీనియర్ న్యాయవాదులు రాఘవేంద్ర మోహన్, బ్రాహ్మణ సువాసిని శీల, డాక్టర్ శ్రీనాథ్, సరేంద్రాచార్, గిరి, సిమెంట్ గిరి, కల్లి ,వెంకటేశ్ ,విజయేంద్ర,విజయ్ రాజవాచార్, లక్ష్మీకాంత్, విజయ్ విఠల్, గురురాజ్ కులకర్ణి, విజయ్ విఠల్, విఠల్ రావ్, రామారావు కులకర్ణి, హరిప్రసాద్, విజేంద్ర, వజ్రమణి అనిల్, ఆలూరు అనంతచార్, వరుణ్, కార్తీక్, వాదిరాజా, గురుతేజ,శ్యామ్, సంతోష్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఓటరు జాబితాలో నమోదు చేసుకోండి

● ఉపాధ్యాయులకు కమిషనర్ జహీరా నసీమ్ సూచన

బళ్లారి సిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నార్త్ ఈస్ట్ టీచర్స్ నియోజకవర్గానికి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కర్ణాటక నార్త్ టీచర్స్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కలబురగి డివిజన్ ప్రాంతీయ కమిషనర్ జహీరా నసీమ్ సూచించారు. ఓటర్ల నమోదుకు సంబంధించి కలబురగి డివిజన్‌లోని ఏడు జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, జడ్పీ సీఈఓలు, ఏడీసీలు, రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఈశాన్య ఉపాధ్యాయ నియోజవర్గ శాసన మండలి సభ్యుల పదవీకాలం 01-11-2026న ముగియనుంది. అర్హత తేది 01-11-2025 వర్తించేలా కర్ణాటక ఈశాన్య ఉపాధ్యాయ అభ్యర్థుల ఓటర్ల జాబితా నూతనంగా రూపొందించిన కార్యవర్గం అందుబాటులో ఉందన్నారు. మునుపటి ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లు కూడా నమూనా 19, అనుబంధం-2లో తగిన సమాచారం నింపి దరఖాస్తు సమర్పించాలన్నారు.

షెడ్యూల్ వివరాలు

06-11-2025(గురువారం) దరఖాస్తు నమూనా 19లో దరఖాస్తు స్వీకరణ చివరితేది
25-11-2025(మంగళవారం) ఓటర్లజాబితా ప్రకటన
25-11-25(మంగళవారం)నుంచి10-12-2025(బుధవారం) వరకు అభ్యంతరాల స్వీకరణ
30-11-25మంగళవారం) తుది ఓటరు జాబితా ప్రకటన

అర్హులైన ఉపాధ్యాయుల సంఖ్యలో కర్ణాటక ఈశాన్య ఉపాధ్యాయుల పోలింగ్ ప్రక్రియలో వారిపేర్లు నమోదు చేసుకోవడం జిల్లా తాలూకా స్థాయిలో విస్తృతంగా ప్రచారం, క్రియాశీలంగా నమోదు చేసే జిల్లావారు వారు స్వీప్ సృష్టించాలని నిర్దేశక కమిటీ తెలిపింది.

అర్హతలు

● నవంబరు 1నాటికి 2025 డిగ్రీ, అంతకంటే ఎక్కువ అర్హత కలిగిన రాష్ట్రంలోని గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో మొత్తం 3సంవత్సరాలు చదివి ఉండాలి.
● ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 16కి.మీ పరిధిలో 30మంది ఓటర్లు ఉంటే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయవచ్చు. సమాచారం కోసం ఆయ జిల్లాల జిల్లా నగరాభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలి

ఈసందర్భంగా జిల్లాపంచాయితీ సీఈఓ మహమ్మద్ హారీస్, అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్, కమిషనర్ ప్రమోద్, మహానగర పాలక కమిషనర్ మంజునాథ్ , డీడీపీయూ, డీడీపిఐ, బీఈఓ అధికారులు, జిల్లా ఎన్నికల కార్యాలయం సిబ్బంది, వివిధ రాజీయ పార్టీల నాయకులు వర్చువల్లో పాల్గొన్నారు.

హంపిలో పర్యాటకుల సందడి



విరూపాక్షేశ్వరుడి ఆలయం ముందు భక్తులు

కంప్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవులు ముగియనుండడం, వారాంతం కావడంతో హంపికి పర్యాటకులు పోటెత్తుతున్నారు. శనివారం విరూపాక్షేశ్వరుడు, పార్వతి, భువనేశ్వరి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గత రెండు మూడు రోజులతో పోలిస్తే ఈ రోజు మరింత అధికంగా భక్తులు వచ్చారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ యేడాది వర్షాలు పుష్కలంగా వుండటంతో ఏ గుట్టలో చూసినా పచ్చదనంతో నిండిపోయి పర్యాటకులను మరింత ఆకట్టుకుంటున్నాయి. సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలతో సందడి చేస్తున్నారు.

వర్షానికి 21 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు

కంప్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని గూడదూర్ గ్రామంలో వర్షానికి 21 గొర్రెలు మృతి చెందాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో యంకప్ప గొర్రెల మందలో 11 గొర్రెలు, హనుమంతప్పకు చెందిన తొమ్మిది, సన్న యంకప్పకు చెందిన ఒక గొర్రె మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రవి నాయక్, గ్రామ పరిపాలన అధికారి రాజు చవాన్, పశు వైద్యాధికారి చెన్నవీర సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. వాతావరణం అనుకూలించకనే గొర్రెలు మృతి చెందినట్లు వారు తెలిపారు.

మొక్కజొన్న సాగును పరిశీలించిన అధికారులు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారి దేవరాజ్

కంప్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : తాలుకా వ్యవసాయ శాఖ అధికారి దేవరాజు శనివారం కురుగోడు పరిధిలోని మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతు మల్లికార్జున పొలాన్ని పరిశీలించిన ఆయన సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా మొక్కజొన్న పెరుగుదల కుంటు పడిందని, పంటపై పౌడరీ బూజు, డౌనీ బూజు అధికంగా వ్యాపించిందన్నారు. ఈ వ్యాధిని నియంత్రించడానికి, ఎటువంటి వ్యాధి రాకుండా వుండటానికి రైతులు వెంటనే పంటలకు క్లోరో ఫైరిఫాస్‌లు, క్లోరి ఫిలిఫేస్ గ్రానోసా మూడు కిలోలు, గ్రాన్యులర్ శరణధాన ఒండు ఐదు కిలోలు వంటి గ్రాన్యులర్ పురుగు మందులను వేయాలన్నారు. సందేహాలుంటే వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

హోసూరు జోన్

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో శ్రీవారు

హోసూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ తిరుపతిగా పేరొందిన గోపసంద్రం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకం, అలంకరణలు చేశారు. అనంతరం మహామంగళారతి ఇచ్చారు. ఆలయంలోని ఆంజనేయస్వామికి తులసిమాలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు.

వృద్ధులను గౌరవించడం అందరి కర్తవ్యం

● సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి అశోక్

సిరుగుప్ప, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించడం నేర్చుకోవాలని సివిల్ న్యాయాధికారి అశోక్ సూచించారు. శనివారం సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ భవనంలో సీనియర్ సిటిజన్ల దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మొక్కలకు నీరు పోసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో పిల్లలు పెద్దలకు గౌరవించడం మరచిపోయారని ఇది చాలా బాధాకరమన్నారు. భారతదేశంలో మొట్టమొదటి సారిగా గురువులను, తల్లిదండ్రులను గౌరవించే సాంప్రదాయం వుండేదని తెలిపారు. ముందు రోజు కూడా సీనియర్ సిటిజన్ల సలహాలు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియా బేగమ్, తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమాంర్, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్‌కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఉప్పర వెంకోబ, సీనియర్ సిటిజన్స్ అబ్దుల్ నబీ, తదితరులకు సన్మానం చేశారు.

అనారోగ్యంతో రైలు ప్రయాణికుడి మృతి

గుత్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తూ అనారోగ్యంతో ఓ ప్రయాణికుడు మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన ఇస్మాయిల్ సాహెబ్ (42) అనే ప్రయాణికుడు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలో ప్రయాణిస్తున్నాడు. అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. గమనించిన తోటి ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో రైలు గుత్తి స్టేషన్‌కు రాగానే ఆ ప్రయాణికుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నడిరోడ్డుపై పశువుల సంచారం

● తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ వాహనదారుల ఆవేదన



సన్నాపురం రోడ్డుపై అడ్డంగా ఉన్న పశువులు



ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా..

కంప్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఏ రోడ్డులో చూసినా వీధి పశువుల సంచారమే కనిపిస్తోంది. రోడ్లపై పశువులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పశుసంచారంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పురసభ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పురసభ అధికారులు వీధి పశువులపై దృష్టిసారించి విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులని వెంటనే గోశాలకు తరలించాలని కోరుతున్నారు. అంబేడ్కర్ సర్కిల్ కురుగోడు రోడ్డు, బళ్లారి రోడ్డు ప్రభుత్వాస్పత్రి, రాజ్‌కుమార్ పాలు రోడ్డులో దుకాణం యజమానులు తమ సామాగ్రి బయట పెట్టేందుకే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాలపై దాడి చేసి జొన్నలు, కందులు, పెసలు ఇతర వాటిపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు.

విరగ్గాసిన సజ్జ



ఏపుగా కాసిన సజ్జపంట

కంప్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కంప్లి, కురుగోడ తాలూకా పరిధిలోని పలు గ్రామాల్లో ఈ యేడాది సజ్జపంట అధికంగా సాగు చేశారు. పంట ఏపుగా పెరుగుతోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, మిరప ఇతర పంటలతో పోలిస్తే ఈ ఏడు సజ్జ అధిక దిగుబడి వస్తోందని అన్నదాత అంటున్నారు. కురుగోడు పరిధిలోని బైలూరు, సింధిగేరి, కురుగోడు, సిరిగేరి, గ్రామాల పరిధిలో సజ్జపంట అధికంగా సాగు చేశారు.

రహదారి పనులు పూర్తయ్యేదెన్నడో..?

సిరుగుప్ప, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనులు పూర్తయ్యేదెన్నడో.. ఈ నరకయాతన ఇంకెన్ని రోజులని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరుగుప్ప తాలుకా పరిధిలో టెక్కలకోట నుంచి దడేసూగూరు గ్రామం వరకు 11 కిలోమీటర్ల రోడ్డు పనులు ప్రారంభమై మూడేళ్లు గడిచింది. ఇంతవరకు పనులు పూర్తి కాలేదు. అధికారులు ఈ విషయంపై నిర్లక్ష్యం వహించడం తగదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడేళ్లలో 23 మంది ఈ రోడ్డులో ప్రమాదాలకు గురై మృతి చెందగా వందమందికి పైగా గాయాలబారిన పడ్డారు. ప్రజలు ఈ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారిలో వర్షాల వల్ల ఎక్కడపడితే అక్కడ అడుగులోతు గుంతలు ఏర్పడి అందులో వర్షపునీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



గుంతలమయంగా మారిన జాతీయ రహదారి

'బీమా' హత్యలపై పోలీసుల ఆరా

● కలకలం రేపిన దివ్యాంగుడు గంగాధర హత్య ● కళాశాల అధ్యాపకుడు, బ్యాంకు ఉద్యోగితో పాటు ముఠాలో ఎవరెవరున్నారో..?



అధ్యాపకుడు గంగాధర



బ్యాంకు ఉద్యోగి యోగరాజ్

బళ్లారి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): హోస్పేట్‌లో గత నెల 28న జరిగిన యాచకుడు గంగాధర హత్య తెలుగు సినిమా కుబేరా కథలాగే ఉంది. సినిమాలో యాచకుల ఖాతాల్లో రూ.కోట్లు జమ చేసి తర్వాత వారిని చంపేస్తారు. అదే రీతిలో ఇక్కడ బిక్షగాళ్ల పేరుతో ప్రమాద బీమా చేయించి డబ్బులు డ్రా చేసుకోవాలనే ఉద్దేశంతో హత్యచేసి ప్రమాదంగా చిత్రీకరించారు. స్క్రీన్‌ప్లే, డైరెక్షన్, స్పాట్ లోకేషన్‌కు తుంగభద్ర ఎగువకాలువ అడ్డాగా మారింది. సీన్ కట్ చేస్తే.. సెప్టెంబరు 28న గంగాధర అనే దివ్యాంగుడు యాచకవృత్తితో జీవనం సాగిస్తున్నాడు. అతనిని టార్గెట్ చేస్తూ ఎలాగైనా బీమా చేయించి డబ్బులు పొందాలని ముఠాకు అలోచన పుట్టింది. కొప్పళ జిల్లా గంగావతి లోని ప్రభుత్వ కళాశాలలో ఉపన్యాసకుడిగా పనిచేస్తున్న కృష్ణప్ప కథ రాశాడు. దీన్ని బ్యాంకు ఉద్యోగి యోగరాజ్ సింగ్ అమలు చేశారు. అంతే బ్యాంకుకు రోజూ వచ్చే గొసంగి రవి. అజేయ్, రియాస్, అనే వ్యక్తులతో ఒక ముఠాను ఏర్పర్చుకున్నారు. ఉలి గమ్మను కూడా ఇందులో పాత్రదారిగా చేర్చారు. యాచకులను ఎంచుకుని, బీమా చేయించి వారిని చంపి రూ. కోట్లు కోట్లు డబ్బులు అక్రమ మార్గంలో సంపాదించుకోవాలనేది వీరి ఉద్దేశం. అయితే పోలీసుల విచారణలో నిజాలు బయటపడడంతో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఇలాంటి హత్యలు ఇంకా ఏమైనా చేశారా..? ఈ మధ్య కాలంలో ఇలాంటి ప్రమాదం పేరుతో ఎవరైరా మరణించారా.? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. బళ్లారి డీఐజీ రేంజ్ పరిదిలోని బళ్లారి, విజయనగర, కొప్పళ, బళ్లారి జిల్లాల్లో ఇలాంటి ఘటనలు ఏమైనా జరిగాయా అని పోలీసులు విచారణ చేపట్టారు. విజయనగర, కొప్పళ, బళ్లారి, రాయచూరు. జిల్లాలో ఎక్కవ గా దేవాలయాలు ఉన్నాయి. అలాగే దేవాలయాల పక్కనే తుంగభద్ర నది ప్రవహిస్తుంటుంది. ఇక్కడ అనేక ప్రాంతాల నుంచి యాచకులు బిక్షాటనతో జీవనం గడుపు తుంటారు. ఇలాంటి వారినే టార్గెట్ చేస్తూ బీమా డబ్బుల ఆశ చూపి బీమా చేయించాక వారిని హ త్య చేసి డబ్బులను ముఠా పంచుకుంటుంది అనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కవగా విజయనగర, కొప్పళ జిల్లాలో ఇలాంటి ఘటనలు జరిగాయనే అనుమానం కూడా పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి ప్రమాదాలు జరిగాయా..బీమా చేయించి మరణించారని డబ్బులు డ్రాచేశారా.. అనే కోణంలో కూడా ఇన్సూరెన్స్ కార్యాలయాల వద్ద నుంచి సమాచారం సేకరిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లపైనా కూపీ లాగుతున్నారు. అయితే ఇంత చదువు చదివి ఇదేమి నీచబుద్ది.. ఒకరు ప్రభుత్వ కళాశాలల్లో ఉపన్యాసకులు, మరొకరు బ్యాంకు ఉద్యోగి ఇలాంటి దారుణానికి పాల్పడ్డారు అంటూ పలువురు ఆశ్చర్యపోతున్నారు. అమాయకులను చంపేసి సొమ్ము చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు ఉద్యోగి యోగేంద్ర సింగ్, కళాశాల ఉపన్యాసకులు కృష్ణప్పను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

సెయింట్ వళ్ళలార్ (జయంతి)




వళ్ళలార్‌గా పేరొందిన తమిళ నాడుకు చెందిన సన్యాసి 'జ్యోతి రామలింగ స్వామి' 1823 అక్టోబరు 5న జన్మించారు. అసలు పేరు తిరువరుత ప్రకాశ వళ్ళలార్ చిదంబరం రామలింగం. పాఠాలు చెబుతూ జీవనం సాగించారు. కొన్నాళ్ళకు అక్కడ జ్యోతి తప్ప మరేమీ కనిపించలేదు. 19వ శతాబ్దంలో గొప్ప కవిగా పేరొందారు. ప్రపంచశాంతికోసం సంగీతకారుడిగా, కవిగా 'తిరు అరుప్పా' పేరిట 5,818 పద్యాలు రాసి స్వరకల్పన చేశారు. కులబేధాలు అమానవీయమని ప్రచారం చేసి ఆచరించారు. 1874 జనవరి 30న తన గదిలోకి ప్రవేశించి జ్యోతిస్వరూపంగా మారారు.

కన్నాంబ (జయంతి)



ప్రముఖ రంగస్థల నటి, గాయని, తెలుగు సినీరంగంలో పేరొందిన పసుపులేటి కన్నాంబ 1911 అక్టోబరు 5న ఏలూరులో జన్మించారు. 13వ యేట నాటకాల ద్వారా ప్రవేశించి అనంతరం 'హరిశ్చంద్ర' సినిమాలో చంద్రమతిగాను, ద్రౌపదీ వస్త్రాపహరణంలో ద్రౌపదిగా నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. సుమారు 150 పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాలలో నటించారు. నవరసాలను సమర్థవంతంగా అవలీలగా పోషించే అద్భుత నటీమణిగా పేరొందారు. భర్త కడారు నాగ భూషణంతో కలసి రాజరాజేశ్వరి సినీ నిర్మాణ సంస్థ ద్వారా తెలుగు, తమిళ, కన్నడ భాషలలోనూ సిని మాలు నిర్మించారు. 1964 మే 7న తుదిశ్వాస వీడారు.

మధురాంతకం రాజారాం (జయంతి)



ప్రముఖ కథకులు మధురాంతకం రాజారాం 1930 అక్టోబరు 5న చిత్తూరు జిల్లా పాకాల మండలం మొగరాలలో జన్మించారు. 400కుపైగా కథలు, రెండు నవలలు, నవలికలు, నాటకాలు, గేయాలు, సాహితీవ్యాసాలు రచించారు. పలు తమిళ రచనలను తెలుగులోకి అనువదించారు. అలాగే ఈయన కథలు తమిళ, హిందీ, కన్నడ, ఆంగ్ల భాషలలోకి అనువాదం అయ్యాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. 1999 ఏప్రిల్ 1న కన్నుమూశారు.

చో రామస్వామి (జయంతి)



చో రామస్వామి 1934 అక్టోబరు 5న తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని మైలాపూర్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు శ్రీనివాస అయ్యర్ రామస్వామి. నటుడు, కమెడియన్, క్యారెక్టర్ యాక్టర్‌గానే కాక ఎడిటర్‌గాను, స్క్రీన్‌ప్లే, దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. 60, 70 దశకాలలో ప్రముఖ నటులందరితో కలసి నటించారు. రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆయనను రాజ్యసభకు నామినేట్ చేశారు. 1997 నుంచి 2002 వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. తమిళ వారపత్రిక 'తుగ్లక్'ను స్థాపించి ఎడిటర్‌గా కొనసాగారు. మూడు దశాబ్దాలకుపైగా రచనలు అందించారు. 2016 డిసెంబరు 7న కన్నుమూశారు. 2017లో సాహితీ సేవలకు మరణానంతర 'పద్మ భూషణ్' ప్రకటించారు.

స్టీవ్ జాబ్స్ (వర్ధంతి)



అమెరికాకు చెందిన వ్యాపార దిగ్గజం స్టీవ్‌జాబ్స్ 1955 ఫిబ్రవరి 24న జన్మించారు. పూర్తి పేరు స్టీవెన్ పాల్ జాబ్స్. పెట్టుబడి దారుడిగా, మీడియా ప్రొప్రైటర్‌గా పేరొందారు. యాపిల్ సంస్థ సహసంస్థాపకుడు, ఛైర్మన్ అండ్ సీఈఓ. 1970, 80లలో పర్సనల్ కంప్యూటర్ విప్లవంలో కీలకంగా వ్యవహరించారు. నేషనల్ మెడల్ ఆఫ్ టెక్నాలజీ పురస్కారం అందుకున్నారు. డిజిటల్ విప్లవ పితామహగా పిలవబడ్డారు. తుదిశ్వాస వరకు యాపిల్ సంస్థకు పనిచేశారు. 2011 అక్టోబరు 5న కన్నుమూశారు.

అశోక్ ఖేణి (పుట్టినరోజు)



అశోక్‌ఖేణి 1950 అక్టోబరు 5న బీదర్‌లో జన్మించారు. నటుడిగా, రాజకీయ నాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా రాణించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్ట్ సంఘానికి గౌరవ ఛైర్మన్‌గా వ్యవహరించారు. కర్ణాటక బుల్‌డోజర్స్ క్రికెట్ టీమ్‌కు ఓనర్‌గా కొనసాగారు. నంది ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ఎంటర్‌ప్రైజెస్ (నైస్) ఎండీగా ఉన్నారు. 2013 నుంచి 2018 వరకు బీదర్ దక్షిణ ఎమ్మెల్యేగా కొనసాగారు.

సార్.. మీకులం, ఆస్తుల వివరాలు చెప్పండి

● డీకే శివకుమార్ ఇంట్లో కులగణన నిర్వహించిన అధికారులు ● బంగారం ఆరాపై డీసీఎం ఆగ్రహం



వివరాలు సేకరిస్తున్న సర్వే సిబ్బంది

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమై పదిరోజులు కావస్తోంది. బెంగళూరు నగరంలో శనివారం నుంచి శ్రీకారం చుట్టారు. సదాశివనగర్‌లోని డీసీఎం డీకే శివకుమార్ ఇంటికి సర్వే సిబ్బంది చేరుకున్నారు. మతం, కులం, ఉపకులం వివరాలను నమోదు చేశారు. జన్మస్థలం కనకపుర తాలూకా దొడ్డహాలహళ్ళిగా నమోదు చేశారు. వృత్తి వ్యవసాయంగా పేర్కొన్నారు. 25 ఆవులు, ఎడ్లతోపాటు గొర్రెలు, మేకలు ఉన్నట్లు తెలిపారు. కుటుంబానికి 50 ఎకరాల ఆస్తి ఉందని, పాడి రంగం కోళ్ల పెంపకం, మల్బరీసాగు ఉందని నమోదు చేశారు. 4 వాణిజ్యభవనాలు నమోదు చేయించారు. ఏసీ, రిఫ్రిజిరేటర్ ఉన్నట్లు తెలిపారు. 31వ ఏట పెళ్లి చేసుకున్నానని ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సౌకర్యాలు పొందలేదని, రిజర్వేషన్ సౌలభ్యం కూడా పొందలేదని నమోదు చేయించారు. ఆదాయానికి సంబంధించిన ప్రశ్నకు పెద్దస్లాబు ఏది అందులో నమోదు చేయాలన్నారు. రాజకీయ ప్రాతినిధ్యంకు సంబంధించి మంత్రిగా నమోదు చేయాలన్నారు. వాస్తవానికి మంత్రి అనే నమోదు దరఖాస్తులో లేదు. బంగారం వివరాలు కోరినందుకు డీసీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత వివరాలు అడగరాదన్నారు. ప్రశ్నలు సాధారణంగా ఉండాలని ఎక్కువ ప్రశ్నలు ఉండరాదని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ప్రజలను గాభరా పెట్టే సర్వే వద్దన్నారు. కులాలవారీగా జనాభా, విద్య, ఆర్థిక పరిస్థితి తెలుసుకునేందుకు మాత్రమే సర్వే చేపట్టాలన్నారు.

విద్యార్థులు అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

» డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి పిలుపు



స్నాతకోత్సవంలో పట్టాల ప్రదానం

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎక్కడనుంచి వచ్చామనేది ప్రాధాన్యత కాదని, ఏ స్థాయికి చేరామనేది కీలకమని మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఇండియన్ అకాడమీ కళాశాల (అటానమస్) ఎనిమిదో స్నాతకోత్సవం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం మారుమూల గ్రామంలో జన్మించినా అంతర్జాతీయస్థాయిలో పేరొందారన్నారు. ప్రపంచంలోనే 40శాతం మంది నైపుణ్యత కల్గినవారు భారత్‌నుంచే వెలిగినవారన్నారు. రానున్న 50ఏళ్ల ప్రపంచమే భారత్‌వైపు చూసేకాలమన్నారు. పరిశోధనలు, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో దేశ కీర్తిపతాకం ఎగురవేయడంలో యువ విద్యార్థులు భాగస్వామ్యులు కావాలన్నారు. బెంగళూరు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ నిరంజన్ వానల్లి మాట్లాడుతూ నేర్చుకోవడానికి చివరిది అనేది ఉండదన్నారు. జీవితంలో తృప్తి అనేది ఏదైనా సాధనతోనే సాధ్యమన్నారు. 400మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. బీబీఏ విభాగం నుంచి సల్మా సుల్తానా 9.56 ర్యాంకింగ్‌తోనూ, ఎంఎస్‌సీ బయో టెక్నాలజీలో వినీత 9.92 శాతంతో టాపర్ లుగా నిలిచారు. ఇండియన్ అకాడమీ ఎడ్యుకేషన్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ టీ సోమశేఖర్, కార్యదర్శి భారతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ భారతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మీనాక్షి సుందర, డాక్టర్ టీ శ్రీనివాసరావ్, పరిశోధనల విభాగం డైరెక్టర్ డాక్టర్ ద్వారకనాథ్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు.

ఆలయాలే టార్గెట్..!

● ఏపీ, కర్ణాటకలో చోరీలు ● అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● రూ.22 లక్షల ఆభరణాలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన అనంతపురం ఎస్పీ జగదీష్



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోరీ చేసే ముఠాను కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఏపీ, కర్ణాటకలోని 18 ఆలయాల్లో ఈ ముఠా చోరీలు చేసినట్లు గుర్తించారు. ముఠా నుంచి రూ.22 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రాగి, ఇత్తడి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు వివరాలను కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబుతో కలిసి అనంతపురం ఎస్పీ జగదీష్ వివరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శెట్టూరు మండలం మాకొడికి గ్రామానికి చెందిన మర్రిస్వామి అలియాస్ సంగీత(45), రాజు(37), శెట్టూరుకు చెందిన ముచ్చర్లపల్లి శ్రీనివాసులు(49) స్నేహితులు. వ్యసనాలకు బానిసలయ్యారు. డబ్బు కోసం ఆలయాలు, ఊళ్లకు దూరంగా ఉండే ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

ఇక్కడంతా చోరీలు..

శెట్టూరు మండలం పర్లచేడు తాటి మారెమ్మ ఆలయం, చింతర్లపల్లి ఆంజనేయస్వామి ఆలయం, కుందుర్పి మండలం బెస్తరపల్లిలోని సవారమ్మ దేవాలయం, యర్రగుంలోని మారెమ్మ ఆలయం, కంబదూరు మండలంలోని కొత్త మిద్దెల పెద్దమ్మ ఆలయం, రాంపురం మారెమ్మ ఆలయం, కొత్తూరు నరసింహస్వామి ఆలయం, అండేపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, వైసీ పల్లి గౌడ చంద్రమ్మ ఆలయం, కొగరబండ తిమ్మప్ప దేవాలయం, కళ్యాణదుర్గం మండలం కదరంపల్లి పోలేరమ్మ ఆలయం, గోళ్లలోని మారెమ్మ ఆలయం, బోరంపల్లిలోని సుంకులమ్మ, మారెమ్మ ఆలయాలు, కళ్యాణదుర్గం అక్కమాంబ ఆలయం, బెళుగుప్ప మండలం యలగలవంకలోని గౌసంద్ర మారెమ్మ ఆలయం, గంగవరంలోని మారెమ్మ ఆలయం, గంగవరం-విరుపాపల్లి గ్రామాల మధ్య ఉన్న సుంకులమ్మ ఆలయాల్లో చోరీలు చేశారు. దేవుళ్ల, దేవతల విగ్రహాలకు అలంకరించిన ఆభరణాలు, రాగి, ఇత్తడి వస్తువులను చోరీ చేశారు. కళ్యాణదుర్గం పట్టణం, మండలంలోని దాసంపల్లిలోని రెండు ఇళ్లలో బంగారం ఆభరణాలను తస్కరించారు.

కర్ణాటకలోనూ కేసులు

నిందితులపై కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా హిరియూరు, అబ్బినహోల్, చెళ్లికేర పట్టణంలో చోరీ కేసులు ఉన్నాయి. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం రూరల్, అప్‌గ్రేడ్ స్టేషన్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వీరిని అరెస్టు చేశారు. మొత్తం 44 గ్రాముల బంగారం ఆభరణాలు, 12.350 కిలోల వెండి ఆభరణాలు, వస్తువులు, 20 కిలోల ఇత్తడి గంటలు, 5 కిలోల రాగి బిందెలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషించిన సీఐలు నీలకంఠేశ్వర, వంశీకృష్ణ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వైభవంగా ఉమామహేశ్వర కల్యాణం



కల్యాణోత్సవంలో మధుసూధన సాయి

చిక్కబళ్ళాపుర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ముద్దేనహళ్ళిలోని సత్యసాయి గ్రామంలో ఉమా మహేశ్వర కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సద్గురు మధుసూదన సాయి ప్రసం గిస్తూ ఇది ఆధ్యాత్మికతలో గొప్ప అంశమని, ప్రకృతి (ఉమా), పురుషుల (మహేశ్వర) దైవిక కలయికకు చిహ్నమన్నారు. దైవారాధన స్థిరంగా ఉండేందుకు మన సంస్కృతి సంప్రదాయాలు దోహదపడతాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆటో డ్రైవర్ల జీవితాల్లో వెలుగులు

రూ.15 వేలు ఖాతాల్లో జమ

టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపిందని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ అన్నారు. శనివారం హిందూపురంలో ఆటో డ్రైవర్లు ఎంజీఎం క్రీడా మైదానం నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌లో తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు. ఇతర సంక్షేమ పథకాలను సైతం నెరవేరుస్తోందన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కావడంతో వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. స్త్రీశక్తి పథకం మహిళలకు ఎంతగానో ఉపయోగపడిందని, అయితే ఆటోడ్రైవర్లకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశ్యంతో వారి ఖాతాలో రూ.15వేలు జమ చేయడం జరిగిందన్నారు. హిందూపురం 908 మంది ఆటోడ్రైవర్లకు రూ.1.36కోట్లు వారి ఖాతాల్లో జమచేశారన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కే దక్కిందన్నారు. ప్రధాని మోదీ నుంచి సహకారం పుష్కలంగా ఉండటంతో రాష్ట్ర అభివృద్ధి వేగం పుంజుకుందన్నారు. ఈ సందర్భంగా చెక్కును ఆటోడ్రైవర్లకు అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు బేవనహళ్లి ఆనంద్, జయప్ప, చంద్రమోహన్, పరిమళ, శ్రీదేవి, పార్టీ కన్వీనర్లు వెంకటేశ్, రాము, అభిలాష్, శ్రీనివాస్, నాయకులు నాగరాజు, అనీల్‌కుమార్, సతీష్, పవన్, డైమండ్‌బాబా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



అలంకరణలో హనుమంతుడు

బొమ్మనహాళ్, అక్టోబర్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో వెలసిన అంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు స్వామి వారి మూలవిరాట్‌కు పూజలు జరిపించారు. ఉదయం పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు జరిపించి పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు.



విద్యారణ్యపురలోని కాళికాదుర్గా పరమేశ్వరి దేవికి మహాలక్ష్మి అలంకరణ

సవితా సహాయ కూట ఆధ్వర్యంలో 7న ఆరోగ్యశిబిరం

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సవితా సహాయ కూట బెంగళూరు ఆధ్వర్యంలో ఈనెల 7న మంగళవారం ఉచిత ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేశారు. కడబగెరెలోని కిరణ్ నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో శిబిరం కొనసాగనుంది. కొంచూరు సవితా పీఠాధిపతి సవితానందస్వామిజీ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. మధుమేహం, దంత పరీక్షలు, ఈసీజీ, కంటి పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్, మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలదాకా శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు ప్రకటించారు. విధానపరిషత్ సభ్యుడు కిశోర్, టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ వేణుగోపాల్ ముఖ్యఅతిథులుగా విచ్చేయనున్నారన్నారు. మధ్యాహ్నం సవితా సమాజానికి చెందిన ముఖ్యుల చర్చాగోష్టి ఉంటుందన్నారు. సమాజానికి చెందినవారంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆంథ్రోపిక్ సీటీఓగా పీఈఎస్ పూర్వవిద్యార్థి



రాహుల్ పాటిల్

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి రాహుల్ పాటిల్ ప్రపంచంలోనే పేరొందిన ఏఐ పరిశోధనా కంపెనీలలో ఒకటైన ఆంథ్రోపిక్‌లో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ)గా నియమింపబడ్డారు. రాహుల్ పాటిల్ 1998 నుంచి 2002 దాకా కంప్యూటర్ సైన్స్ కోర్సు చేశారు. ఆంథ్రోపిక్ సంస్థ సీటీఓగా ఎంపిక కావడం పట్ల పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి, వీసీ డాక్టర్ జే సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ కే శ్రీధర్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

కోళ్ల పెంపకంతో ఆర్థిక పురోగతి



నాటి కోడిపిల్లలు పంపిణీ చేస్తున్న అధికారులు

శిడ్లఘట్ట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టుగూళ్ల పెంపకంతోపాటు కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా పురోగతి సాధించాలని పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పశువుల ఆసుపత్రి ఆవరణలో మహిళలకు మైసూరు రకం నాటి కోడిపిల్లలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు కుమార్ పాల్గొన్నారు. పశుసంవర్ధకశాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్ మార్గదర్శకంలో గ్రామీణ ప్రాంతాల చిన్న, సన్నకారు రైతులను ఆర్థికంగా ప్రోత్సహించేలా నాటిరకం కోళ్ల పెంపకానికి చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, సామాన్యవర్గాల వారికి నాటికోడిపిల్లలను ఉచితంగా సమకూరుస్తోంద న్నారు. నాటు కోడికి, నాటి కోడిగుడ్లకు డిమాండ్ ఉందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిక్కబళ్ళాపుర జిల్లా పట్టు, పాడి పెంపకం, పూలు, పండ్లు, కూరగాయల సాగులో గుర్తింపు పొందిందన్నారు. అదే రీతిన కోళ్ల పెంపకంలోనూ రాణించాలని అభిలషించారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ డాక్టర్ నితిన్‌కుమార్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సౌమ్య, అధికారి వీరేశ్, సి బ్బంది పుష్ప, అనిల్, మంజు, మూర్తి, అబ్లుడు మంజు తదితరులు స్థానిక గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వజ్రాల కోసమే చోరీ

● నంది విగ్రహం అపహరణ కేసు ఛేదింపు

● నలుగురు గుప్త నిధుల వేటగాళ్ల అరెస్టు



ధ్వంసమైన నందివిగ్రహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నంది విగ్రహం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, ధ్వంసమైన నంది విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఈ కేసు వివరాలను విలేకరులకు శనివారం వెల్లడించారు. ముష్టికోవెల శివారులో ఉన్న పురాతన శివాలయంలో గత నెల 4న నందివిగ్రహం చోరీ అయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పావగడలో సీసీ ఫుటేజీ, కాల్‌డేటా ఆధారంగా నిందితులను గుర్తించారు. నంది విగ్రహంలో వజ్రాలు ఉన్నాయనే అనుమానంతో చోరీ చేసినట్లు తేల్చారు. అర్ధరాత్రి విగ్రహాన్ని చోరీ చేసి, బొలెరోలో తీసుకెళ్లారని, పావగడ తాలూకా వీర్లగూడి గ్రామ సమీపంలో నంది విగ్రహాన్ని ధ్వంసం చేశారని డీఎస్పీ తెలిపారు. వజ్రాలు లేకపోవడంతో విగ్రహాన్ని ఒక పాడుబడిన బావిలో పడేశారని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు ధ్వంసమైన నంది విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మధుగిరి తాలూకా తుముకూరు జిల్లా బడవహనహళ్లికి చెందిన మధుసూదన్, దీపక్ శెట్టి, చిత్రదుర్గ జిల్లా తుమకూర్లుహళ్లికి చెందిన భానుప్రసాద్, సి.హరివేసాంద్రాకు చెందిన చందన్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు నాగేంద్ర సహా మిగిలినవారిని త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ, ట్రైనీ ఎస్ఐ గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.